సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



ఘనంగా పౌర్ణమి పూజలు

డాబాగార్డెన్స్ : కనక మహాలక్ష్మి దేవస్థానంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు.



నేత్రపర్వంగా గరుడసేవ

సింహచలం: వరహలక్ష్మీ నృసింహస్వామి గరుడ సేవ బుధవారం నేత్రపర్వంగా సాగింది.



ఆధ్యాత్మిక తరంగాలు

మాఘ పౌర్ణమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. సముద్ర తీర ప్రాంతాలు జన సందోహంతో నిండిపోయాయి. 8లో

న్యూస్‌రీల్

వీడని పొగ మంచు



దుంబ్రిగుడలో కురుస్తున్న మంచు

చింతపల్లి/దుంబ్రిగుడ: జిల్లాలో దట్టంగా పొగ మంచు కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంటలు దాటినా మంచు తెరలు వీడక పోవడంతో అవస్థలకు గురవుతున్నారు. ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉన్నాయి. జి.మాడుగులలో 12.5 డిగ్రీలు, జీకే వీధిలో 12.5, పెదబయలులో 14.8, చింతపల్లిలో 15.4, హుకుంపేటలో 15.2, ముంచంగిపుట్టులో 15.7, పాడేరులో 15.9, అనంతగిరిలో 17.5, కొయ్యూరులో 18.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

కనకమహాలక్ష్మి హుండీల ఆదాయం రూ.33.13 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

డాబాగార్డెన్స్(విశాఖ): కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీల ఆదాయం లెక్కింపు బుధవారం చేపట్టారు. గత నెల 4వ తేదీ నుంచి ఈ నెల 12వ తేదీ వరకు రూ.33,13,320 నగదు, 91.100 గ్రాముల బంగారం, 831 గ్రాముల వెండి లభించింది. యూఎస్‌ఏ డాలర్లు 58, సింగపూర్ డాలర్లు 2, కెనడా డాలర్లు 65, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దిర్హామ్ 25, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సెంట్రల్ బ్యాంక్ దిర్హామ్ 5, బ్యాంక్ నగేర మలేషియా ఆర్ఎమ్ 2, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బహ్రెయిన్ దీనర్ ఒకటి, నేపాల్ రాష్ట్ర బ్యాంక్ రూపీస్ 110 లభించాయి. లెక్కింపులో ఆలయ ఈవో కె.శోభారాణి, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయ తనిఖీదార్ ఎం.శ్రీధర్, ఆలయ సహాయ కార్యనిర్వహణధికారి కె.తిరుమలేశ్వరరావు, గోపాలపట్నం శ్రీ హరి సేవ సభ్యులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు.. గొడుగుల నీడలో పనులు



కర్రలకు గొడుగులు కట్టి వాటి నీడలో పనులు చేస్తున్న గిరిజన మహిళలు

ముంచంగిపుట్టు: కొన్ని రోజులుగా భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ పెరుగుతూ ఉండడంతో పనులకు వెళ్లే గిరిజనులు గొడుగు పట్టుకుని వెళ్తున్నారు. వనభసింగి పంచాయతీ లుంగాపుట్టు గ్రామ సమీపంలో పిప్పళ్లు సేకరించే గిరిజన మహిళలు ఎండ వేడిని తట్టుకోలేక పని చేసే ప్రదేశంలో కర్రలను పాతి వాటికి గొడుగులు కట్టి, వాటి నీడలో పనులు చేసుకున్నారు.ఫిబ్రవరి నెలలోనే ఎండ వేడి ఈ విధంగా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అని జనం భయపడుతున్నారు.

ముమ్మరంగా తనిఖీలు



కొత్తూరు సమీపంలో కల్వర్టు వద్ద తనిఖీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టు నుంచి కుమడ,కొత్తూరు జంక్షన్ వైపు వెళ్లే మార్గాలలో బుధవారం సీఆర్‌పీఎఫ్ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. కల్వర్టులు,వంతెనల వద్ద బాంబ్ స్క్వాడ్‌తో పరిశీలించారు.మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.వాహనాల రికార్డులు పరిశీలించారు. అనుమానితులను ప్రశ్నించి,విడిచి పెట్టారు.ఆర్టీసీ బస్సుల్లో సైతం తనిఖీలు చేశారు.ప్రయాణికుల బ్యాగులు,లగేజీలు పరిశీలించారు.సాయంత్రం మండల కేంద్రంలో పోలీసులు గస్తీని నిర్వహించారు.

ఐటీడీఏ చేతిలో కాఫీ రైతుల దగా

కాఫీ రైతు కష్టం ఐటీడీఏ పాలవుతోంది. మద్దతు ధర పొందడంలో రైతన్నలు దగా పడ్డారు. దళారులు, వ్యాపారుల మోసానికి గురికావద్దని, కాఫీ పండ్లను ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యాక్స్ సంస్థకే విక్రయించి లాభం పొందాలని ప్రకటనలు చేసిన అధికారులే రైతులను నట్టేట ముంచారు. రైతులు కష్టపడి కాఫీ పండ్లు సేకరిస్తే అతి తక్కువ ధర చెల్లించి, వారికి ఆవేదన మిగిల్చారు.



మోదాపల్లిలో కిలో రూ.90 ధరతో కాఫీ పండ్లను కొనుగోలు చేస్తున్న నాంది సంస్థ సిబ్బంది



- అతి తక్కువ ధర కిలో రూ.44తో కొనుగోలు చేసిన అధికారులు
- ప్రైవేట్ సంస్థ రూ.90తో సేకరణ
- ఆరు కిలోల కాఫీ పండ్లకు కిలో పాచ్‌మెంట్ గింజల ఉత్పత్తి
- కిలోకు రూ.200 నష్టపోతున్న రైతులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

సాక్షి,పాడేరు: అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన జిల్లాలో కాఫీ పంటకు పండ్ల దశలోనే ఈఏడాది డిమాండ్ ఏర్పడింది. బెంగళూరు మార్కెట్‌లో కాఫీ గింజల వ్యాపారం భారీగా జరుగుతోంది. జిల్లాలో ఈ ఏడాది కాఫీ పంట దిగుబడి కాస్త తగ్గినప్పటికీ నాణ్యమైన కాఫీ కావడంతో ప్రైవేట్ వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు,కార్పొరేట్ సంస్థలు ఇక్కడ కాఫీపైనే ప్రత్యేకంగా దృష్టి పెట్టాయి. 1.90 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఫలసాయం ఇచ్చే కాఫీ తోటలను గిరిజన రైతులు సాగు చేస్తున్నారు.14వేల మెట్రిక్ టన్నుల పాచ్‌మెంట్ కాఫీ గింజలు ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం.

నాంది సంస్థ రూ.90తో కొనుగోలు

మన్యంలో కాఫీ పండ్ల సీజన్ ప్రారంభం నుంచి నాంది కార్పొరేట్ సంస్థ దూకుడుగా ఉంది. ఐటీడీఏకు చెందిన చింతపల్లి మ్యాక్స్ సంస్థ సీజన్ ప్రారంభం నుంచి కిలో రూ.44ధరతో కారుచౌకగా కొనుగోలు చేసింది.ఇప్పటికే ఐటీడీఏ కాఫీ విభాగం 700 మెట్రిక్ టన్నుల వరకు కాఫీ పండ్లను సేకరించి చింతపల్లి మ్యాక్స్ సంస్థకు తరలించింది.అయితే అరకులోయలోని చినలబుడు కేంద్రంగా పనిచేస్తున్న నాంది అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థ మాత్రం కాఫీ పండ్లను కిలో రూ.90 రికార్డు ధరతో కొనుగోలు చేస్తోంది. ఇప్పటికే 2,000 టన్నుల వరకు కాఫీ పండ్లను కొనుగోలు చేసింది. దీంతో ఆ సంస్థకు పండ్లు విక్రయించిన రైతులు అధిక లాభాలు పొందారు. ఆరు కిలోల కాఫీ పండ్ల ద్వారా కిలో పాచ్‌మెంట్ ఎండు గింజలు ఉత్పత్తి అవుతాయి.అంటే కిలోకు రూ.540 ఆదాయం వస్తుంది. అలాగే జిల్లాలోని 12 రైతు ఉత్పత్తి సంఘాలు కిలో రూ.60 చొప్పున కాఫీ పండ్లు కొనుగోలు చేశాయి. ఇప్పటి వరకూ ఒక్కో సంఘం 500 టన్నులు చొప్పున సేకరించాయి.

మ్యాక్స్ రూ.44తో కొనుగోలు

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐటీడీఏ మ్యాక్స్ మాత్రం కిలో కాఫీ పండ్లను రూ.44తక్కువ ధరకు కొనుగోలు చేసింది. దీంతో ఈ సంస్థకు విక్రయించిన గిరిజన రైతులు కిలోకు రూ.200 నష్టపోయారు.ఇటీవల బెంగళూరు మార్కెట్‌లో అమ్మకాలు ద్వారా వచ్చిన ఆదాయంలో కిలోకు కేవలం రూ.8 బోనస్ చెల్లించడంపై కాఫీ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కాఫీ పండ్లను కిలో రూ.90తో నాంది సంస్థ కొనుగోలు చేసి అధిక లాభాలు ఇస్తే,ఐటీడీఏ మాత్రం బోనస్‌తో కలుపుకొని కాఫీ పండ్లకు కిలో రూ.52చెల్లించడం అన్యాయమని రైతులు వాపోతున్నారు.



కాఫీ పండ్లను కొనుగోలు చేస్తున్న సిబ్బంది

నాంది సంస్థతో మేలు



ఈఏడాది కాఫీ పంటకు ప్రభుత్వం కన్నా నాంది సంస్థే అధిక ధర కల్పించింది. కిలో రూ.90 ధరతో కొనుగోలు చేసింది. దీంతో ఆ సంస్థకు విక్రయించిన రైతులు లాభాలు పొందారు.పల్పింగ్,గింజలను ఆరబెట్టడం,మార్కెటింగ్‌కు తరలించే ఇబ్బందులు లేకుండానే నాంది సంస్థకు పండ్లు విక్రయించిన రైతులకు మంచి ఆదాయం లభించింది. కిలో పాచ్‌మెంట్ గింజలకు రూ.540 ధర లభించినట్టయింది.

– పాలికి లక్కు, కాఫీ రైతుల సంక్షేమ సంఘం, జాతీయ నాయకుడు, మోదాపల్లి గ్రామం, పాడేరు మండలం

గిట్టుబాటు ధరల కల్పనే లక్ష్యం



ఏజెన్సీలోని కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నాం .చింతపల్లి మ్యాక్స్ సంస్థ ద్వారా కిలో రూ.44తో కొనుగోలు చేసిన కాఫీ పండ్లకు రూ.8బోనస్ చెల్లిస్తున్నాం.అన్ని ఖర్చులు పోను వచ్చే ఆదాయం కాఫీ రైతులకే చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.నాంది సంస్థ పూర్తిస్థాయిలో నాణ్యమైన కాఫీ పండ్లను రైతుల నుంచి కొనుగోలుచేస్తోంది.చింతపల్లి మ్యాక్స్ సంస్థకు మాత్రం రైతులు కాయలు,పండ్లను కలిపి విక్రయిస్తుండడంతో నాణ్యత పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

– ఎ.ఎస్.దినేష్‌కుమార్, కలెక్టర్

వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా కురసాల కన్నబాబు



సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా మాజీ మంత్రి కురసాల కన్నబాబు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

త్వరితగతిన తాజంగి మ్యూజియం నిర్మాణం

- కలెక్టర్ దినేష్‌కుమార్



నిర్మాణ పనులపై ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చింతపల్లి: తాజంగిలో స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణపనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున కాంట్రాక్టర్‌ను పనుల నుంచి తప్పించామన్నారు. టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులను పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం తాజంగి జలాశయాన్ని పరిశీలించారు. అక్కడ కుడి, ఎడమ కాలువల మరమ్మతు పనులను పూర్తిచేయాలన్నారు. సచివాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ మ్యుటేషన్లలో జాప్యంపై ఆరా తీశారు. భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దారు రవికుమార్‌ను ఆదేశించారు. ఎంపీడీవో శ్రీనివాస్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఏఈఈ యాద కిశోర్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ నీటి సంఘం అధ్యక్షుడు బోనంగి బాలయ్యపడాల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్కాగా మెనూ అమలు

ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

పాడేరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్కాగా మెనూ అమలు చేయాలని, పోషకాహార లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మెరుగైన ఆహారం అందించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ ఆదేశించారు.ఐటీడీఏ కార్యాలయంలో 11 మండలాల ఐసీడీఎస్ సీడీపీవోలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టేక్ హోం రేషన్‌ను గర్భిణులు, బాలింతలు సక్రమంగా వినియోగించుకునేవిధంగా అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న గుడ్లు, పాలు, పౌష్టికాహారాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. చిన్నారుల హాజరు, డేటా ఎంట్రీ సక్రమంగా నమోదు చేయాలని, నిత్యం చిన్నారుల ఎదుగుదలను గమనిస్తూ ఉండాలని, బాల్య వివాహాల నివారణపై తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కిశోర వికాసం, సఖీ గ్రూపుల ఏర్పాటుపై ఆరా తీశారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, 11 మండలాల సీడీపీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ



సుండ్రుపుట్టు జీసీసీ డిపోను తనిఖీ చేస్తున్న అభిషేక్ గౌడ

జీసీసీ డిపో, ఎఫ్‌పీ షాపుల తనిఖీ

జీసీసీ చౌకధరల దుకాణాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, రేషన్‌కార్డుదారులకు నాణ్యమైన సరుకులు సకాలంలో సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. మండలంలోని జీసీసీ డీఆర్ డిపో, కిండంగి ఎఫ్‌పీ షాపును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా చోట్ల బియ్యం నిల్వలతో పాటు వంటనూనె, ఇతర నిత్యావసర సరుకులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, గోడౌన్ ఇన్‌చార్జి సంతకం లేనందున అసంతృప్తి వ్యక్తం చేశారు. కిండంగి చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. రేషన్ సరుకుల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. కంది పప్పు సరఫరా తక్కువగా ఉండటాన్ని గమనించి ప్రశ్నించారు. రాజ్‌మా సరఫరా ఎక్కువగా ఉన్నప్పుడు కందిపప్పు తక్కువగా అమ్మకాలు జరుగుతున్నందున సరఫరా తగ్గించినట్టు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి.గణేష్ వివరించారు. జేసీ వెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నల్లన్న తదితరులున్నారు.

జర్రెల ఆశ్రమపాఠశాల వార్డెన్ సస్పెన్షన్

- ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు
- ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

గూడెంకొత్తవీధి: మండలంలోని జర్రెల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల వార్డెన్‌ను కలెక్టర్ దినేష్‌కుమార్ సస్పెండ్ చేశారు. ఎస్పీ అమిత్‌బర్దర్, చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రాతో కలసి బుధవారం మారుమూల గ్రామమైన జర్రెలలో కలెక్టర్ పర్యటించారు. గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు సక్రమంగా మెనూ అమలు చేయకపోవడంతో వార్డెన్ చెట్టి చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను సరిగా లేకపోవడంతో ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్‌నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. క్షేత్రస్థాయిలో వాటిని సక్రమంగా అమలు చేయకపోయినా, విద్యాప్రమాణాలు కుంటుపడినా అందుకు సంబంధిత ఉపాధ్యాయులనే బాధ్యులను చేస్తామన్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.



విద్యార్థి విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ అమిత్‌బర్దర్, ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

అనంతరం గ్రామంలోని గిరిజనులతో ఎస్పీ అమిత్ బర్దర్‌మాట్లాడారు. జిల్లాలో గంజాయి సాగు బాగా తగ్గిందన్నారు. గంజాయి రవాణా, సాగు వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు గిరిజనులు దూరంగా ఉండాలని సూచించారు. గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు పోలీసు శాఖఅవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

వందే భారత్‌ల నిర్వహణ వైజాగ్‌లోనే!

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్న నేపథ్యంలో.. విశాఖ డివిజన్‌లో కొత్త ప్రాజెక్టులపై రైల్వే బోర్డు సన్నద్ధమవుతోంది. ఏడాదిన్నర క్రితం మంజూరైన ప్రాజెక్టులకు మోక్షం కలుగుతోంది. వందేభారత్ రైళ్ల సర్వీసులు పెరుగుతున్న నేపథ్యంలో నిర్వహణ డిపోలు దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా విశాఖలోనూ ఓ మెయింటినెన్స్ డిపో కూడా రాబోతోంది. రూ.500 కోట్లతో షెడ్‌ల నిర్మాణానికి అనువైన స్థలం గుర్తించారు. రైల్వే పరేడ్ గ్రౌండ్‌ని ఎంపిక చేశారు. త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేసేందుకు డివిజన్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

- కొత్త జోన్ ఏర్పాటు నేపథ్యంలో రైల్వే బోర్డు చకచకా అడుగులు
- ఏడాదిన్నర క్రితం మంజూరైన ప్రాజెక్టుకు స్థలం ఎంపిక దాదాపు పూర్తి
- రైల్వే గ్రౌండ్‌లో రూ.500 కోట్లతో మెయింటెనెన్స్ షెడ్ నిర్మాణం
- త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేయనున్న డివిజన్ అధికారులు



వందేభారత్ రైలు



మెయింటెనెన్స్ డిపో రానుంది ఈ మైదానంలోనే..

సాక్షి, విశాఖపట్నం : భారతీయ రైల్వే వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చిన వందే భారత్ రైలు.. అన్ని చోట్లా అద్భుతంగా దూసుకుపోతోంది. అన్ని సదుపాయాలతో వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్న వందే భారత్ రైళ్లకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. విశాఖ నుంచి ప్రస్తుతం సికింద్రాబాద్, దుర్గ్‌కు సర్వీసులు నడుస్తున్నాయి. త్వరలోనే తిరుపతికి కూడా వందేభారత్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ రాబోతున్న నేపథ్యంలో ఇక్కడి నుంచి వందేభారత్ సర్వీసులు మరిన్ని పెరగనున్నాయి. అందుకే విశాఖలో ఈ రైళ్ల నిర్వహణ కోసం మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు భావిస్తోంది. ఏడాదిన్నర క్రితం వందేభారత్ మెయింటెనెన్స్ డిపో వైజాగ్‌లో నిర్మించాలన్న ప్రతిపాదనలు వచ్చాయి. ఆ తర్వాత అధికారులు దీనిపై సమీక్ష నిర్వహించారు. ఇప్పుడు జోన్ ప్రక్రియ వేగవంతం కావడంతో మరోసారి ప్రాజెక్టు తెరపైకి వచ్చింది.

రైల్వే పరేడ్ గ్రౌండ్ అనుకూలం

మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకు అప్పట్లో స్థల పరిశీలన చేశారు. రైల్ ట్రాక్ కనెక్టివిటీ ఉన్న ఖాళీ స్థలాల్ని అధికారులు పరిశీలించారు. తొలుత వడ్లపూడిలోని వ్యాగన్ వర్క్‌షాప్ పక్కన నిర్మించాలని భావించారు. అయితే రైలు విశాఖ స్టేషన్ నుంచి అక్కడికి వెళ్లి తిరిగి వచ్చేందుకు చాలా సమయం పడుతుంది. అదే సమయంలో స్టేషన్‌కు రావాలంటే అవుటర్‌లో ఖాళీ లేకపోతే.. గంటల తరబడి వేచి ఉండాలి. దీంతో నిర్దిష్ట సమయానికి కొన్ని సార్లు నడపడం వీలవదు. ఈ సమస్యల్ని దృష్టిలో పెట్టుకొని విశాఖ రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే దీన్ని నిర్మించాలని భావించారు. ఇందుకోసం. రైల్వే పరేడ్ గ్రౌండ్‌ను సూత్రప్రాయంగా ఎంపిక చేశారు. విశాఖ రైల్వే స్టేషన్‌కు అర కిలోమీటర్ దూరంలో ఈ గ్రౌండ్ ఉంది. వాల్తేరు రైల్వే డివిజన్ స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలు, ఇతర క్రీడాపోటీలు, ఎగ్జిబిషన్లకు ఈ గ్రౌండ్‌ను వినియోగిస్తున్నారు. సుమారు 6 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ గ్రౌండ్‌కు వెనుక వైపు పిట్‌లైన్ మాదిరిగా రైల్ ట్రాక్ ఉంది. డిపో నిర్మాణ సమయంలో ఈ పిట్‌లైన్‌కు ట్రాక్‌లను అనుసంధానం చేస్తే పని సులువవుతుంది. అందుకే రైల్వే గ్రౌండ్‌ని మెయింటెనెన్స్ డిపో నిర్మాణ స్థలంగా ఎంపిక చేశారు. ఇప్పటికే రూ.500 కోట్లు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేసి అనుమతుల కోసం రైల్వే బోర్డుకు పంపించనున్నట్లు వాల్తేరు డివిజన్ అధికారులు వెల్లడించారు.

వందే భారత్ నెట్‌వర్క్ బలోపేతమయ్యేలా...

వందేభారత్ రైళ్ల కోసం మెయింటెనెన్స్ డిపోలు దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా దక్షిణ కోస్తా జోన్ పరిధిలోని విశాఖ డివిజన్‌లో ఓ డిపో ఏర్పాటు కానుంది. ఈ డిపోలో వందేభారత్ రైళ్లను నిలిపి ఉంచుతారు. ఈ రైళ్లలో ఇన్‌స్పెక్షన్ అండ్ మెయింటెనెన్స్ టేబుల్స్ నిర్వహిస్తారు. ఈ టేబుల్స్‌లో పర్ఫార్మెన్స్ టెస్ట్‌లు, ప్రివెంటివ్ మెయింటెనెన్స్ ప్రొసీజర్‌ల వివరాలు ఉంటాయి. వందేభారత్ రైళ్ల కోసం ట్రాక్షన్, ప్రధాన ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్‌లకు ప్రివెంటివ్, కరెక్టివ్ మెయింటెనెన్స్‌ను అందించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. ఇక్కడ రాబోతున్న డిపోలో రన్నింగ్ మెయింటెనెన్స్ బేలో ట్రిప్ షెడ్యూల్‌లు లేదా వీక్లీ షెడ్యూల్‌లు వంటి కార్యాచరణ నిర్వహణ కోసం సౌకర్యాలు కల్పిస్తారు. ఇందులో అండర్ గేర్, ఓవర్ హెడ్ పరికరాలు, ఇంటీరియర్‌లను తనిఖీ చేయడం, వాషింగ్, క్లీనింగ్, బ్రేక్ సిస్టమ్‌లు, డ్రాఫ్ట్ గేర్ (కప్లర్లు), ఎయిర్ కండిషనింగ్, ఇతర ఎలక్ట్రికల్, మెకానికల్ సబ్‌సిస్టమ్‌ల మరమ్మతులు నిర్వహించే అవకాశం ఉంది. ఒకేసారి 5 నుంచి 10 వందే భారత్ రైళ్లను ఇక్కడ మెయింటెనెన్స్ చేసేలా నిర్మాణం ఉండబోతుందని వాల్తేరు వర్గాలు చెబుతున్నాయి.

కోడి మాంసం, గుడ్ల విక్రయాలు నిలిపివేయాలి

- ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: కోడి మాంసం,గుడ్ల విక్రయాలను వెంటనే నిలిపివేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం బుధవారం ఆదేశించారు. రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాధి విస్తరిస్తున్న నేపథ్యంలో మాంసం, గుడ్ల విక్రయాలను తక్షణం నిలిపివేయాలన్నారు. పాఠశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మాంసం,గుడ్లు పెట్టవద్దని సూచించారు.ఎవరైనా ఈ ఆదేశాలను అతిక్రమించి విక్రయాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ విక్రయాలు జరపవద్దన్నారు.

సీఐఎస్ఎఫ్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు

కంచరపాలెం(విశాఖ) : సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) కానిస్టేబుల్, డ్రైవర్, డ్రైవర్ కం పంప్ ఆపరేటర్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఉపాధి కార్యాలయం అధికారి(క్లరికల్) సీహెచ్.సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణతతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి 21 నుంచి 27 ఏళ్ల వయసు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు httpr://cisfrectt.cif.gov.in వెబ్‌సైట్‌లో మార్చి 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా - డ్రైవర్ మృతి


పెద్దభాయి మృతదేహం

కొయ్యూరు: నడింపాలెం వంతెన సమీపంలో ఇసుక ట్రాక్టర్ బోల్తా పడి, డ్రైవర్ చెదల పెద్దభాయి(40) మరణించాడు. కొయ్యూరు ఎస్‌ఐ కిషోర్‌వర్మ ఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బట్టపనుకుల పంచాయతీ గన్నెర్లపాలెంకు చెందిన పెద్దభాయి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం నడింపాలెం కాలువ నుంచి ఇసుకను ట్రాక్టర్‌పై తీసుకువస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ఇంజన్, ట్రక్‌కు మధ్యలో చిక్కుకుని పెదభాయి మరణించాడు. భార్య, పిల్లలు మృతదేహం వద్ద బోరున విలపించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదానికి గురైన స్కూటీ

గంగవరం: మండలంలోని జడేరు వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జడేరు శివారు చెలకవీధికి చెందిన చేప రాంబాబు(35) అనే వ్యక్తి మృతి చెందాడు. గంగవరం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడ్డతీగల నుంచి గంగవరం వైపు వెళ్తున్న స్కూటీని వెనుక వస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ఢీకొని, చాలా దూరం ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు జాతీయ రహదారి పక్కనే గోతిలో పడిపోయాయి. స్కూటీపై ప్రయాణిస్తున్న రాంబాబు తీవ్రంగా గాయపడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అడ్డతీగల సీహెచ్‌సీకి తరలించారు. గంగవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాట్సాప్ ద్వారా అప్పన్న ఆర్జిత సేవ టికెట్లు

సింహాచలం: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనం టికెట్లు, ఆర్జిత సేవ టికెట్లు పొందవచ్చని ఈవో వి.త్రినాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. వాట్సాప్ నెంబర్ 95523 00009 ద్వారా భక్తులు పై సేవలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

తగరపువలస: చిట్టివలస గణేష్ థియేటర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనంలో సీలింగ్ పనులు చేస్తూ ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం కొత్త చెరకుపల్లికి చెందిన రిక్క తోగులురెడ్డి(26) బుధవారం సీలింగ్ పనులకు వినియోగించే అల్యూమినియం చానల్స్ ఉపయోగిస్తున్నాడు. ఇంటి బయట విద్యుత్ స్తంభం వైర్లకు అవి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి తల్లిదండ్రులు నరసింహులు, నరసయ్యమ్మ, పెళ్లయిన అన్నయ్య చిట్టిబాబు, చెల్లెలు రాజు ఉన్నారు. తోగులు రెడ్డికి ఇంకా వివాహం కాలేదు. మృతుడి బంధువులతో భవన నిర్మాణ కాంట్రాక్టర్ చర్చలు జరుపుతున్నారు. మృతదేహాన్ని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ఆధ్యాత్మిక తరంగాలు


రేవుపోలవరం తీరంలో పోటెత్తిన భక్తులు

మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలకు భక్తులు పోటెత్తారు. బుధవారం వేకువజాము నుంచే జిల్లాలోని సాగర తీరాలు కిటకిటలాడాయి. సముద్రంలో స్నానమాచరించి, దంపతులు బ్రహ్మముడులు వేయించుకున్నారు. పెద్దలకు తర్పణాలు వదిలారు. పురోహితులు, జంగమ దేవరలు వారితో పూజలు చేయించారు. భక్తులు సూర్యనమస్కారాలు చేసి, తీరంలో ఉన్న దేవాలయాల్లో పూజలు చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. చెదురుమదురు ఘటనలు జరిగినా వెంటనే అప్రమత్తమైన పోలీసులు, గత ఈతగాళ్లు నీట మునిగిన వారిని రక్షించారు.

- సాగర తీరాల్లో మాఘ పౌర్ణమి సందడి
- పుణ్య స్నానాలకు పోటెత్తిన భక్తులు

అచ్యుతాపురం/ఎస్.రాయవరం: మాఘ పౌర్ణమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పుణ్యస్నానాలు చేసి, భక్తితో పూజలు చేశారు. పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లోని సముద్ర తీర ప్రాంతాలు జన సందోహంతో నిండిపోయాయి. పూడిమడక, రేవుపోలవరంతోపాటు వాడపాలెం, రాజయ్యపేట, చందనాడ, బోయపాడు, బంగారయ్యపేట, పెంటకోట, పాల్మన్‌పేట తీరాలు కిక్కిరిసిపోయాయి. పూడిమడక తీరంలో మంగళవారం రాత్రంతా జాగరణలో దైవనామ స్మరణ, సాంస్కృతిక కార్యక్రమాల వీక్షణతో గడిపిన జనం తెల్లవారుజాము నుంచే స్నానాలు చేసి, జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. బైనో క్లాక్ కళ్లద్దాల ద్వారా భక్తులకు నిశితంగా పరిశీలించారు. డ్రోన్ కెమెరాల సాయంతో ఎక్కడి పరిస్థితులను అక్కడ పర్యవేక్షించారు. బోట్లలో సముద్రంలోకి వెళ్లిన పోలీసులు భక్తులు స్నానం ఆచరిస్తున్న తీరును పరిశీలించారు. తప్పిపోయిన ఇద్దరు చిన్నారుల్ని పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు. స్నానం ఆచరిస్తున్న భక్తునికి ఫిట్స్ రావడంతో ఒడ్డుకు తీసుకొచ్చి సపర్యలు చేశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించారు. మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు.


లక్ష్మీమాధవ స్వామి ఆలయాన్ని దర్శించిన భక్తులు


జంగమ దేవర పూజలు


సముద్ర స్నానం అనంతరం బ్రహ్మముడులు వేయించుకుంటున్న దంపతులు

రేవుపోలవరంలో భక్తుల తాకిడి

రేవుపోలవరం తీరంలో పుణ్య స్నానమాచరించిన దంపతులకు బ్రహ్మముడులు వేసి, మరణించినవారికి తర్పణాలు వదిలి పురోహితులు పూజలు జరిపించారు. భక్తులు తీరం సమీపంలో పర్వతంపై వెలసిన శ్రీ లక్ష్మీమాధవస్వామి, దిగువన శ్రీ షిరిడీ సాయినాథుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాష్ట్ర హోం మంత్రి అనిత సముద్ర స్నానం చేసి లక్ష్మీమాధవస్వామిని దర్శించుకున్నారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో అమాంతం ఒకేసారి భక్తుల తాకిడి పెరగడంతో తీరం కిక్కిరిసిపోయింది. అడ్డురోడ్డు నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, తప్పిపోయిన వారిని అప్పగించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గర్భిణులు, బాలింతలకు సత్వర సేవలు అందాలి

- ఆస్పత్రులు తనిఖీ చేసిన కేంద్ర వైద్య బృందం

అనకాపల్లి: గర్భిణులు, బాలింతలకు సకాలంలో వైద్యసేవలు అందించాలని కేంద్ర వైద్య బృందం ప్రతినిధి డాక్టర్ డిఆర్.వరుణ్ విజయ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి, మండలంలో తుమ్మపాల, తగరంపూడి పీహెచ్‌సీలలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వైద్యశాఖకు అందజేస్తున్న గర్భిణుల విభాగం, రక్త పరీక్షల విభాగాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు కేంద్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని, వాటిని గ్రామాల్లో ఉన్న ఆశ వర్కర్స్, అంగవాడీ ఉద్యోగులు సకాలంలో అందించే విధంగా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్త పరీక్షలకు రాష్ట్ర ప్రభుత్వానికి కొంత నిధులు కేటాయిస్తుందని, వాటిని సకాలంలో వినియోగించుకోవాలన్నారు. అంతకుముందు ఆస్పత్రుల్లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా మలేరియా అధికారి కె.వరహాలుదొర, జిల్లా గణాంక అధికారి రామచంద్రరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్య అధికారి షేక్ నజరత్ సమీమ్, తగరంపూడి వైద్యరాలు పావని పాల్గొన్నారు.


తుమ్మపాల పీహెచ్‌సీలో మందుల వివరాలను పరిశీలిస్తున్న కేంద్ర వైద్య బృందం ప్రతినిధి డాక్టర్ వరుణ్ విజయ్

కె.కోటపాడు సీహెచ్‌సీ సందర్శన

కె. కోటపాడు: జాతీయ ఆరోగ్య మిషన్ కేంద్ర బృందం సభ్యులు బుధవారం గ్రామాల్లో పర్యటించారు. మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. కేంద్ర బృందం సభ్యులు జి. వరుణ్ విజయ, జె. ప్రశాంత్, బి.లూసి సారథ్యంలో బృందం సభ్యులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఆస్పత్రిలో జరుగుతున్న ప్రసవాలు గురించి ఆరా తీశారు. మలేరియా, డెంగ్యూ, కుష్ఠు, వ్యాధి, వాటి నివారణ చర్యలు గురించి సమీక్షించారు. గర్భిణులకు అందిస్తున్న సేవలు, చిన్నారులకు అందిస్తున్న వ్యాక్సిన్ వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. వీరి వెంట డీఎంవో కె.వరహలుదొర, డీసీఓ జగదీశ్, రామచంద్రరావు, చోడవరం మలేరియా సబ్‌యూనిట్ అధికారి రమణ, సీహెచ్‌సీ వైద్యులు కార్యక్రమములో పాల్గొన్నారు. ఆనంతరం బృందం సభ్యులు కింతాడ హెల్త్ వెల్‌నెస్ సెంటరును పరిశీలించారు.


కె.కోటపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఉత్సాహంగా తాండవ గిరి ప్రదక్షిణ

నాతవరం : నల్లగొండమ్మ తల్లి ఆలయం కొండ చుట్టూ బుధవారం భక్తిశ్రద్ధలతో భక్తులు గిరి ప్రదక్షిణలు చేశారు. తాండవ గ్రామంలో వెలసిన నల్లగొండమ్మతల్లి కొండ చుట్టూ కొన్నేళ్లుగా మాఘపౌర్ణమి రోజున భక్తులు గిరిప్రదక్షణ చేయడం ఆనవాయితీ. ఈఏడాది కూడా భక్తులు అధిక సంఖ్యలో బుధవారం తెల్లవారుజామున తాండవలో నల్లగొండమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత తాండవ ఆడాకుల తాండవ స్పిల్‌వే గేట్లు, జాలారిపేట గ్రామం మీదుగా నాతవరం, గొలుగొండ కొయ్యూరు మండలాల పరిధిలో సుమారుగా ఏడు కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షణ చేశారు. భక్తులకు తాగు నీరు, మజ్జిగ ఉత్సవ కమిటీ సభ్యులు అందించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం వద్ద అన్నదానం జరిపారు. గిరిప్రదక్షిణ అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో గుండెపోటుకు తక్షణ చికిత్స


చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుండెపోటు బాధితుడు

చింతపల్లి: చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో గుండె పోటు బాధితులకు స్టెమీ పద్ధతిలో ప్రాణాలు కాపాడేందుకు మెరుగైన చికిత్స అందుబాటులోనికి వచ్చినట్లు స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరా ప్రియాంక తెలిపారు. ఈ స్టెమి చికిత్సపై రోగులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ప్రియాంక మాట్లాడుతూ చాతినొప్పి, శ్వాస అందకపోవడం, చెమటలు పట్టడం, వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉన్నట్లుయితే గుండె నొప్పికి కారణాలుగా భావించాలన్నారు. ఈ లక్షణాలతో వచ్చిన రోగికి వెంటనే ఆక్సిజన్ పెట్టి ఇసిజీ తీయడం జరుగుతుందన్నారు. స్టెమీ పద్ధతి ద్వారా చికిత్స ప్రారంభిస్తామన్నారు. ఆస్పత్రికి వచ్చే హృద్రోగులను కాపాడేందుకు టెనెక్ట్‌ప్లేజ్ ఇంజెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కొద్దిసేపటికే రోగికి కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ లక్షణాలతో బుధవారం ఆస్పత్రికి వచ్చిన చింతపల్లి మండల కేంద్రానికి చెందిన తంగేటి నారాయణమ్మ, లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని కోటకొండ గ్రామానికి చెందిన గెమ్మిలి సోమరాజు, కిన్నెర్ల గ్రామానికి చెందిన పాంగి బలరామ్మూర్తిలకు చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి తప్పించగలిగామన్నారు. గుండె పోటు వచ్చిన 4 నుంచి 6 గంటల సమయాన్ని గోల్డెన్ అవర్ అంటారని, ఆ సమయంలోగా వస్తే ఈసీజీ తీసి నిపుణుల సూచనల మేరకు చికిత్స అందజేస్తామన్నారు. ఆస్పత్రికి వచ్చిన హృద్రోగుల్లో అవసరమైన వారికి టెనెక్ట్‌ప్లేజ్ ఇంజెక్షన్ ఉచితంగా అందజేయనున్నట్టు తెలిపారు. గుండె సంబంధిత రోగులకు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న ఈ చికిత్స అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ ఇందిరా ప్రియాంక కోరారు.

కుంభమేళాకు ఆర్టీసీ బస్సు పయనం


కుంభమేళా బస్సును ప్రారంభించిన జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడు

దాబాగార్డెన్స్(విశాఖ): ద్వారకా బస్ స్టేషన్ నుంచి కుంభమేళా(ప్రయోగరాజ్)కు ఏపీఎస్ఆర్టీసీ సర్వీస్ బుధవారం బయలుదేరి వెళ్లింది. జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు యాత్ర బస్సును ప్రారంభించారు. ఈ యాత్ర ఏడు రోజుల పాటు వివిధ పుణ్యక్షేత్రాల మీదుగా సాగనుందని తెలిపారు. కుంభామేళాకు ఈ నెల 16న మరో ట్రిప్ నడపనున్నట్టు పేర్కొన్నారు. టికెట్ ధర రూ.8 వేలుగా నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్ లేదా సమీప బస్‌స్టేషన్‌లో టికెట్స్ పొందవచ్చని, మరిన్ని వివరాలకు 9052227083, 9959225602, 9959225594, 9100109731 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ఐవోసీలో ఉద్యోగాలకు గడువు ఈనెల 23

అనకాపల్లి టౌన్: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ జూనియర్ ఆపరేటర్ పోస్టులు 215, జూనియర్ అటెండెంట్ పోస్టులు 23, జూనియర్ అటెండర్ గ్రేడ్ 1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అధికారి (ఇన్‌చార్జ్) ఎన్.కె.మనోరమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పై పోస్టులలో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీలోగా నిరుద్యోగ యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9990601187 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదు

పాడేరు : జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదని, కోడిగుడ్లు, కోడిమాంసంపై అపోహలు వద్దని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నర్సింహులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బర్డ్‌ఫ్లూ వైరస్ సంక్రమించిన కోళ్లను నిర్ధారించడం కోసం జిల్లాలో పశు సంవర్ధక శాఖ ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలతో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇతర జిల్లాల నుంచి సరఫరా అయ్యే కోళ్లు, గుడ్లు విషయంలో జిల్లా వ్యాప్తంగా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు.

ఏటీఎం కార్డు కాజేసి మహిళకు టోకరా

రూ.30 వేలు డ్రా చేసిన మోసగాడు


బాధితురాలికి సహాయపడుతున్నట్టు నటిస్తున్న మోసగాడు (సీసీ కెమెరా ఫుటేజ)

నర్సీపట్నం: నమ్మించి ఏటీఎంలో నగదు కాజేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన ఫాతిమా తన తల్లి ఆపరేషన్ నిమిత్తం అప్పు చేసి, నగదు డ్రా చేసేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ఏటీఎంకు ఈనెల 11న వెళ్లింది. ఏటీఎంలో జనం ఎక్కువ మంది ఉండడంతో ఆమె వరుసలో నిలుచుంది. అప్పటికే ఏటీఎంలో మాటువేసిన మోసగాడు నగదు డ్రా చేస్తున్న వారిని గమనిస్తున్నాడు. ఫాతిమాతో మాట కలిపాడు. ఆమె ఏటీఎం నుంచి రూ.10 వేలు నగదు డ్రా చేసింది. నగదు డ్రా చేయడంలో ఆమెకు సహాయపడినట్టు నటించిన మోసగాడు పిన్ నంబరు గుర్తు పెట్టుకున్నాడు. వేరే కార్డు ఆమెకు ఇచ్చేసి, ఆమె కార్డు కాజేశాడు. ఆమె ఖాతా నుంచి మొదటిగా రూ.10 వేలు, పెట్రోల్ బంక్‌లో కార్డు స్వైపింగ్ ద్వారా రూ.20 వేలు కాజేశాడు. తన తల్లి అపరేషన్ నిమిత్తం రూ.1.6 లక్షలు అప్పు చేశానని, కార్డు మార్చేసి మోసగాడు తన ఖాతా నుంచి రూ.30 వేలు కాజేశాడని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై రమేష్ కేసు నమోదు చేశారు. ఏటీఎంలోని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నామని ఎస్సై రమేష్ తెలిపారు.

భార్య మరణించిందని..

అనకాపల్లి: భార్య మృతితో మనస్తాపం చెందిన ఎ.నాగేషు (62) బుధవారం తాకాశివీధిలోని తన ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు చెప్పారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, వారికి గతంలో వివాహం చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి మౌన పోరాటం

- ప్రేమించి పెళ్లాడి ముఖం చాటేశాడని భర్తపై ఆరోపణ
- అత్తవారింటి వద్ద ధర్నా

కె.కోటపాడు: ప్రేమించి పెళ్లి చేసుకున్న తరువాత తల్లిదండ్రులకు ఇష్టం లేదన్న నెపంతో ముఖం చాటేసిన భర్త గుదే సురేష్ వైఖరికి నిరసనగా స్వాతి అత్తవారింటి వద్ద మౌన పోరాటానికి దిగింది. పదేళ్ల ప్రేమకు ఫలితం ఇదేనా అని ఆమె భర్తను ఆవేదనగా ప్రశ్నిస్తోంది. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ.. మధురవాడ ప్రాంతానికి చెందిన తాను, రొంగలినాయుడుపాలెం గ్రామానికి చెందిన సురేష్ విశాఖపట్నం కృష్ణా కళాశాలలో కలిసి చదువుకున్నామని, 2013 నుంచి తమకు పరిచయం ఉందని తెలిపింది. తనను ప్రేమిస్తున్నట్లు సురేష్ తెలపడంతో ఇద్దరం ఇష్టపడినట్లు పేర్కొంది. గత ఏడాది అక్టోబర్ 9న మధురవాడలో రిజిస్టర్డ్ పెళ్లి చేసుకున్నామని, అదే ప్రాంతంలో అద్దె ఇంటిలో కాపురం సాగించామని ఆమె తెలిపింది. తన తల్లిదండ్రులకు ఈ వివాహం ఇష్టం లేదంటూ సురేష్ తమ ఇంటికి గత ఏడాది డిసెంబర్ నుంచి రావడం లేదని ఆమె పేర్కొంది. దీంతో కె.కోటపాడు మండలం రొంగలినాయుడుపాలెంలో గ్రామ పెద్దలకు సురేష్‌తో జరిగిన వివాహం గురించి తెలిపి ఇద్దరినీ ఒక్కటి చేయాలని కోరినట్టు స్వాతి తెలిపింది. భర్త నుంచి తనను వేరు చేసి తన జీవితాన్ని అన్యాయం చేయవద్దని ఆమె కోరింది. బాధితురాలికి న్యాయం జరిగేంత వరకూ పోరాటం చేయనున్నట్లు విశాఖపట్నం, కె.కోటపాడు సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, ఎర్రా దేముడు, గండి నాయుడుబాబు చెప్పారు.


అత్తవారింటి ఎదుట బంధువులు, సీఐటీయూ నాయకులతో ధర్నా చేస్తున్న స్వాతి


స్వాతి, సురేష్‌ల పెళ్లి నాటి ఫొటో (ఫైల్)

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు


మెడల్స్ అందుకుంటున్న బాక్సింగ్ క్రీడాకారులు

నర్సీపట్నం : ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ రైల్వే స్టేడియంలో ఈ నెల 11,12 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో నర్సీపట్నం బాక్సింగ్ అకాడమీ క్రీడాకారులు ఏడు పతకాలు సాధించారు. బొగ్గు మానిక(75) కిలోలు, వడ్డాది నళిని(80)కిలోల విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించారు. ఎల్.సమంత 60 కిలోల విభాగంలో రజత పతకం, సిహెచ్.రోహిణి(80), కె.కృష్ణవేణి(70), కె.తేజస్విని(80) కాంస్య పతకాలు సాధించారు. వై.తేజస్విని 78 కిలోల విభాగంలో కాంస్య పతకంతో పాటు లూసర్ అవార్డ్ దక్కించుకుందని కోచ్ కె.అబ్బు తెలిపారు. ద్రోణాచార్య అవార్డీ వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, రైల్వేస్ కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్, ఏపీ బాక్సింగ్ కార్యదర్శి లక్ష్మణ్‌దేవ్ విజేతలకు పతకాలు అందించి అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE
1100sft, 2BHK Flat at Madhavadhara, Car Parking. Direct call. No brokers. Ph : 96182 11333 [SCA25001575]

TO-LET
3 BHK 1500 SFT G/F Deluxe E/F flat with All Facilities At Sivajipalem Road For Rent. Con. K.V.Rao - 8885371555 [SCA25001573]

Services

GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Wanted
Urg. Req. for Pvt. Ltd. Company, Qualf : Dip. / Degree in Civil Eng. Auto Cad 2D & 3D with good knowledge at Endada. Ph : 79890 60925, 98663 50824 [V- 12329]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. Ph: 9160900024, 9640400073 [HA-1400]

Wanted Male Computer Operators, Cashiers, Batch Incharges and Female Telecallers. Qualification Any Degree. Age Limit: 22 to 45 years, Salary: 10,000/- to 22,000/-. Location: Vizag. Contact: 9248733302, 9248733325 [G-5855]

మర్చంట్ నేవీలో Cruise Shipsలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు, విభాగం అన్ని డిపార్టుమెంట్స్, వ : 18-27, Qly : 10th & అబోవ్ లాయిడ్స్ మ్యారిన్ సర్వీసెస్ Pvt. Ltd, Hyd. T.G., కోయంబత్తూరు(TN) 7675982065 [SCA25001657]

సాక్షి క్లాసిఫైడ్స్
లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/-
అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030